క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భూదేవి, అలిమేలి మంగమ్మ సమేత శ్రీవారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించి మహామంగళహారతి సమర్పించారు. స్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా కొండపై గ్రామస్తులు, భక్తులు స్వామివారి ప్రసాదంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

సి.బెళగల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ తెలిపారు. తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని.. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

గడివేముల: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత కుమారి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నాడు-నేడు పనులపై హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో నాడు-నేడు పనులు చివరి దశలో ఉన్నాయని, వీలైనంత త్వరలో పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల వారీగా పనుల పురోగతిని సంబంధిత సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఎంఈఓ మేరీ సునీత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జోషులావాట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతిలో రెండు, 9వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు తమ తల్లితండ్రులను తీసుకుని రావాలన్నారు. అదే రోజు రాత పరీక్ష నిర్వహించి సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9701593063 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏడాదిలోపు వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి చేస్తాం



సుగాలిమెట్ట వద్ద పంప్‌స్టోరేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

పాణ్యం: ఏడాదిలోపు వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి చేయిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. గోరుకల్లు నుంచి డోన్ నియోజకవర్గానికి నీరు తరలించే వాటర్‌గ్రిడ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి డోన్ నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చుతామని తెలిపారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న హెచ్ఎం

కోడుమూరు రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అమడగుంట్ల హైస్కూల్ హెచ్ఎం అనంతయ్య విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌కు చెందిన 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని తెలిపారు.

పౌష్టికాహారం.. ఆరోగ్యం పదిలం

- సీజనల్ వ్యాధుల కాలం
- జాగ్రత్తలు పాటించకుంటే అనారోగ్యం
- వ్యాధి నిరోధకశక్తి పెంచుకోవాల్సిన సమయం
- పోషకాల ఆహారం అవసరం
- వైద్యుల సలహాలు పాటించడం ఉత్తమం
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం



గడివేముల: వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైనా ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. పోషకాహార ప్రముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా సెప్టెంబర్ నెలలో పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. రోజు వారీగా పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మొల్లా జబీన్ వివరించారు.

వీటికి దూరంగా ఉండడం శ్రేయస్కరం

నిల్వచేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

ఆహారపు అలవాట్లు

- ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.
- ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం.
- రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

రోజువారీ ఆహారం ఇలా:

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవి అందుబాటులో ఉండకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండుకప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒకవేళ కూరగాయ, పెరుగు వద్దనుకున్నప్పుడు 100 గ్రాముల మాంసాహారం ఉండాలి.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి రెండు సార్లకంటే ఎక్కువ తీసుకోరాదు.

పప్పు ధాన్యాలు

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజు ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తినాలి.

జలుబు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడినీరు, పాలు, టీలో ఏదేని ఒకదానికిలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పు ధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా బాగా ఉడికించి తినాలి. మనం తీసుకునే ఆహారంలో కచ్చితంగా ఏడీకేకే విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోశ సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

–డాక్టర్ మొల్లా జబీన్,
పీహెచ్‌సీ వైద్యురాలు, గడివేముల

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రాజారెడ్డి

ఓర్వకల్లు: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఎస్ఐ రాజారెడ్డితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా సోదరభావంతో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

రోడ్డుపై మురుగు



బురదమయంగా మారిన రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో పాఠశాల దగ్గర ఉన్న నీటి పైప్ లీకేజీ కారణంగా రోడ్డు బురదమయంగా మారింది. నీరు నిల్వ చేరడంతో చిత్తడిగా మారి రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దోమలు, లార్వాలు వృద్ధి చేందకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుంగభద్రకు పెరిగిన వరద ప్రవాహం



సంగాల గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

సి.బెళగల్: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీటితో తుంగభద్ర నదికి శనివారం ప్రవాహం పెరిగింది. జిల్లాలోని పడమటి ప్రాంతాలతోపాటు, నదీ పరివాహక గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలతో నదికి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చింది. ఫలితంగా తుంగభద్ర నది తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల తీరాలను తాకుతూ ప్రవహిస్తోంది. కాగా నదిలో పుష్కలంగా వర్షపునీరు ఉండటంతో నదీతీర గ్రామాల్లో తాగునీటి సమస్యకు చెక్ పడనుందని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెట్లను రక్షించుకుంటేనే మానవ మనుగడ



మొక్కలను పంపిణీ చేస్తున్న సీఐ మన్సురుద్దీన్



ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న సీఐ, సర్పంచ్

కోడుమూరు రూరల్: మొక్కలతో మానవ మనుగడ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ అన్నారు. శనివారం శ్రీధర్మపురి అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా సీఐ మన్సురుద్దీన్, సర్పంచ్ భాగ్యరత్న, ఏపీడీ పక్కీరప్ప, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఏపీఓ మోదీన్‌బాషా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ.. చెట్లను విచ్చలవిడిగా నరికేయడం వల్ల ప్రకృతి సమతుల్యం దెబ్బతినడంతో పాటు భూతాపం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఆక్సిజన్ ఇచ్చే చెట్ల సంఖ్య తగ్గిపోతుండడంతో జీవకోటి మనుగడ ప్రమాదంలో పడిపోయిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. పిల్లలకు కూడా చెట్ల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ఉపాధి ఏపీడీ పక్కీరప్ప మాట్లాడుతూ.. ఉపాధి పథకం కింద 12 రకాల దేవతా వృక్షాలు నాటుకునేందుకు అవకాశముందని, ప్రజలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ సూపర్‌వైజర్ రత్నం, ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, రవికుమార్, కిరణ్, గంగాధర్, రఘు, రాఘవేంద్ర, హోటల్ నాగరాజు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆంధ్రయ్య, రాముడు, కృష్ణయ్య, వెంకట్రామిరెడ్డి, షాకీర్‌బాషా, జయన్న, హనుమంతప్ప పాల్గొన్నారు.

విలువిద్య క్రీడలతో ఏకాగ్రత



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా విలువిద్య క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : చిన్నారులు, పెద్దలు విలువిద్య క్రీడను నేర్చుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విలువిద్య క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గతంలో మన జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించారన్నారు. పురాణాల్లో విలువిద్యకు ఎంతో ప్రత్యేక స్థానం ఉందన్నారు. విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య మాట్లాడుతూ ప్రతిభ కనబరచి ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విలువిద్య శిక్షకులు వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

23న హాకీ పురుషుల జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 23 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీనియర్ హాకీ క్రీడాంశంలో పురుషుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ సంఘం కార్యదర్శి సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1995 సంవత్సరం జనవరి 1 వ తేదీ తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 27 నుంచి 30 వరకు ధర్మవరంలో నిర్వహించనున్న 14 వ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. వివరాలకు 9966565317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రవీణ్ కుమార్



ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరంలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రవీణ్ కుమార్



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కర్నూలు (సిటీ): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడ్జూరు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపీకి వచ్చిన రోగులందరికీ అవసరమైన రక్తపరీక్షలు, మందులు అందించాలని తెలిపారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు జరిగిన రోగులను సందర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అందులో రక్తహీనత కలిగిన వారికి చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా ఏఎన్ఎం, ఆశాలు అంగన్‌వాడీ పరిధిలో 5 సంవత్సరాలలోపు పిల్లల గృహ సందర్శనలు చేసి అతిసారా (డయేరియా) లక్షణాలు ఉన్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అన్నీ సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లోని నీటి తొట్టిల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ఎండకు పెట్టుకున్నాక వినియోగించేలా చూడాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశాలు పంచాయతీ సెక్రటరీ, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయించాలన్నారు. అనంతరం టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. ముఖ్యంగా ఎంఆర్1, ఎంఆర్2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి విజయ మాధురి, డీసీఎం ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కూలిన ఇంటి పైకప్పు



కూలిన మిద్దె పైకప్పు

పాణ్యం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద చాకలి నాగేష్‌కు చెందిన ఇంటి పైకప్పు శనివారం కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టిమిద్దె పూర్తిగా తడిసిపోవడం వల్ల కూలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను హెచ్ఎం ప్రాణేష్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఓర్వకల్లు మండలంలో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, ఎంపీడీఓ మల్లీశ్వరి, తహసీల్దార్ నటరాజ్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, జాతీయ మహిళా హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనీ షాపాష, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, ఖాజామియ, ఉసేన్‌సర్కార్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దృష్టి ఎప్పుడూ చదువుపైనే కేంద్రీకరించాలని మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు చెప్పారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం విద్యార్థులకు మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువకుల్లో మాదక ద్రవ్య దుర్వినియోగం, ఆత్మహత్యల ధోరణులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మనస్సు చంచలమైనదని, దానిని ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. వైద్య విద్యార్థులు ఒత్తిడి నిర్వహణ, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు గూగుల్ ఫారమ్‌లో సాధారణ ఆరోగ్య ప్రశ్నాపత్రాన్ని అందించడం ద్వారా వారి మానసిక స్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, ఫార్మకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాజేష్, సైకియాట్రిస్టులు డాక్టర్ గంగాధర్‌నాయక్, డాక్టర్ యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి సహకార పరపతి సంఘంలో రుణం తీసుకున్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవా లని లద్దగిరి సహకార పరపతి సంఘం సీఈఓ దేవకుమార్ తెలిపారు. శనివారం స్థానిక సహ కార సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. సభ్యత్వాలు యథావిధిగా కొనసాగాలంటే రైతులు వారికి సంబంధించిన పొలం, సహకార సంఘం పాసుపుస్తకాలు, ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలను సహకార సిబ్బందికి అందజేయాలని సీఈఓ సూచించారు. ఆధారాలు అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సబ్సిడీలు వర్తించవని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓర్వకల్లు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సభ్యత్వం కలిగిన రైతులు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ సీఈఓ మద్దిలేటి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం ఆధార్‌కార్డు, ఓటరు కార్డు/పాన్‌కార్డు, పొలం పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను సొసైటీలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9989961317, 9502001163 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com